క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భుక్తాపూర్ పరిధిలోని సినిమా రోడ్, మోచిగల్లి, ద్వారకానగర్, విద్యానగర్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి


పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహాజన్ సోషలిస్టు పార్టీ సీనియర్ నాయకులు దుబాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య, చిటి రవి, ఆరెపెల్లి అశోక్, మచ్చ గంగారాం పాల్గొన్నారు.

'దాజీ శంకర్ స్ఫూర్తితో పోరాడుతాం'


నివాళులర్పిస్తున్న నాయకులు

తాంసి: స్వాతంత్ర సమరయోధుడు, ఆదిలాబాద్ మొదటి శాసనసభ్యుడు స్వర్గీయ దాజీ శంకర్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సావర్గాం గ్రామంలో దాజీశంకర్ 38వ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం స్తూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు విలాస్, కుంటాల రాములు, అరుణ్, ముడుపు నళినిరెడ్డి, చిలుక దేవిదాస్, సట్వాజీ, రతన్, సతీష్, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం


మాట్లాడుతున్న వైద్యాధికారి సాగర్

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆయుర్వేద ఆస్పత్రిలో శుక్రవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి వైద్యాధికారి సాగర్, సిబ్బంది నివాళులర్పించారు. ఆయుర్వేద వైద్యం ద్వారా ఎన్నో దీర్ఘకాలిక రోగాలు నయమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ అప్క కిషన్‌ను మాజీ ఎంపీ నగేశ్ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల కాలుకు చికిత్స కావడంతో ఆయనను పరామర్శించారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, పిప్పల్‌ధరి సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, అల్లకొండ ప్రశాంత్ ఉన్నారు.

ఘనంగా కుమురం భీం జయంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

జైనథ్: మండలంలోని మేడిగూడ (ఆర్) గ్రామంలో కుమురం భీం జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పోరాట యోధుడు కుమురం భీం ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



పీపుల్స్ మేనిఫెస్టో కార్యక్రమంలో రైతులు

రైతుల ఎజెండా

రైతు బ(బే)జార్

- కూరగాయలు మార్కెట్లో రైతుల అవస్థలు
- విక్రయాలకు తప్పని తిప్పలు
- సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు

అన్నదాతలు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర రావాలంటే వారికి తగినంత మార్కెట్ సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. వసతి సౌకర్యాలు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. రైతులు పండించిన కూరగాయలు, పండ్లు వంటి ఉత్పత్తులను అధికంగా ధర లభించే ప్రాంతానికి తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. ఆదిలాబాద్ జిల్లాలోని పలు మండలాలకు చెందిన రైతులు జిల్లా కేంద్రంలోని రైతు బజారుకు తమ పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకువస్తారు. ఈసందర్భంగా కూరగాయలను విక్రయించే విక్రయిదారులతో 'సాక్షి' ఆధ్వర్యంలో రైతు బజార్లో పీపుల్స్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించగా.. తమ సమస్యల గురించి చెప్పుకోవడమే కాకుండా తమ అభిప్రాయాలను వెల్లడించారు. – ఆదిలాబాద్/ఎదులాపురం

ఇబ్బంది పడుతున్నాం



రైతు బజార్ విశాలంగా ఉన్నప్పటికీ స్థలం సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. ముందుగా వచ్చిన వారికి స్థలం ఉంటుంది. దాని తర్వాత స్థలం కోసం వెతుకులాడాల్సిందే. లేట్‌గా వస్తే స్థలం లేక దూరంగా కూర్చోవాల్సి వస్తోంది.
– సోన్‌పాల్, అర్కాయి, ఇంద్రవెల్లి

ఎంతో దూరం నుంచి వస్తున్నాం



రైతుబజార్లో విక్రయాలు చేసేందుకు ఎంతో దూరం నుంచి వస్తున్నాం. దీంతో రవాణా చార్జీల అధిక భారంతో అవస్థలు తప్పట్లేదు. పలువురు దళారుల వల్ల రైతులు నష్టపోతున్నారు. వారు స్థానిక విక్రయదారులకు కూరగాయలను సప్లై చేస్తున్నారు. దీంతో సరైన ధర రావడం లేదు.
– సురేశ్, డొంగర్ గావ్, గుడిహత్నూర్

వ్యాపారుల మధ్య పోటీ



కష్టపడి పండించి రైతు బజార్లో విక్రయానికి కూరగాయలను తీసుకువస్తున్నాం. అయితే స్థానిక వ్యాపారుల మధ్య పోటీ కారణంగా కొన్నిసార్లు నష్టపోతున్నాం. రైతులకు మార్కెట్ సౌకర్యం, రవాణా సౌకర్యం కల్పించాలి.
– గణేష్, న్యూ అనంతపూర్, బజార్‌హత్నూర్

సరైన సౌకర్యాలు లేవు



రైతు బజార్లో వసతులు లేవు. గిరాకీ మధ్యలో వదిలేసి దూరంగా వెళ్లి రావాల్సి వస్తుంది. కనీసం తాగునీరు కూడా లేకపోవడంతో తిప్పలు పడుతున్నాం. షెడ్లు నిర్మించినప్పటికీ కేటాయించకపోవడంతో ప్లాస్టిక్ తాడిపత్రులతో ఎండ, వాన నుంచి రక్షణ పొందుతున్నాం.
– అర్జున్, పొన్నారి, తాంసి



దండారీ ఉత్సవాల్లో జాన్సన్‌నాయక్


దండారీ నృత్యం చేస్తున్న జాన్సన్‌నాయక్


కండువాలు కప్పుతున్న జాన్సన్ నాయక్

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ మండలంలోని హీరాపూర్(జే), కొలాంగూడ, మత్తడిగూడ, కన్నాపూర్ గ్రామాల్లో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. దండారీ సభ్యులతో కలిసి కోలాటం ఆడారు. దండరీ ఉత్సవాలకు సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేస్తున్నారని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి..

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని నీటి పారుదల శాఖ చైర్మన్ వేణుగోపాల్‌చారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభా సాయినాథ్, బీఆర్ఎస్ నాయకులు పూర్ణచందర్ నాయక్, కనక తుకారం, పెందోర్ ప్రభాకర్, పెందోర్ పుష్పరాణీ పాల్గొన్నారు.

జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలి

ఖానాపూర్: ప్రజల సమస్యలు తెలిసిన జాన్సన్ నాయక్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమాల్లో గోపాల్, వాల్‌సింగ్, వెంకటేశ్వర్, రవీందర్, తిరుపతి, అశోక్, ప్రసాద్, నవీన్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం

ఖానాపూర్: సీఎం కేసీఆర్ పాలనలోనే అన్నివర్గాలకు న్యాయం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. పట్టణంలోని కరీంకాలనీలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీలోని ఫైసల్, వాసేఖాన్, ఉస్మాన్, వాహబ్, ఆమెర్, సద్దాం, సోను, సోయబ్, సన్న, సలీం, ముసదిక్, ఉమేర్, ఫేరోజ్, వాహబ్, రహిల్, జలీల్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పరిమి సురేశ్, ఖలీల్, శ్రీనివాస్, ఇర్ఫాన్, షోయబ్, కిశోర్, సత్యనారాయణ, సంతోశ్, మెహరాజ్, నశీర్ తదితరులున్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

నార్నూర్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గురువారం వివిధ సబ్ సెంటర్ల నుంచి వచ్చిన గర్భిణులకు స్కానింగ్, రక్తపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి విక్రమ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో గర్భిణుల ఆరోగ్యంపై ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని స్వీకరించాలన్నారు. వైద్య శిబిరంలో హెచ్ఈ చౌహాన్ నాందేవ్, సూపర్‌వైజర్ చరణ్‌దాస్ పాల్గొన్నారు.

14 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

ఇంద్రవెల్లి: మండలంలోని విజయలక్ష్మీ, ఐఎఫ్‌పీసీఎల్, మిథల్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి అమ్మే సమయంలో స్వయంగా రైతే రావాలన్నారు. ఆధార్‌కార్డు వెంట తీసుకోవాలని పేర్కొన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు.

సీఎం కేసీఆర్ సభ విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఇచ్చోడ మండల కేంద్రంలో ఈనెల 16న నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి గోడం నగేశ్, బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్‌లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదిలాబాద్ బైపాస్ వద్ద సభ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట ఎంపీపీలు నిమ్మల ప్రీతం రెడ్డి, తుల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ప్రచారాన్ని అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తాం

జైనథ్: వివిధ పార్టీల, ఇండిపెండెంట్ అభ్యర్థులు నిర్వహించే ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని జైనథ్ ఎస్సై పురుషోత్తం శుక్రవారం హెచ్చరించారు. రిట్నరింగ్ అధికారి అనుమతితో అభ్యర్థులు తమ ప్రచారాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరికీ ప్రచారం చేసుకునే హక్కు ఉంటుందని, దీనికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బూటకపు హామీలు నమ్మొద్దు


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే జోగు రామన్న


గుస్సాడీ వేషధారణలో ఎమ్మెల్యే జోగు రామన్న

- ఆదిలాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న

బేల: కాంగ్రెస్, బీజేపీ నాయకుల బూటకపు హామీలను నమ్మవద్దని ఆదిలాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని అవాల్‌పూర్, సిర్సన్న, బాది, వడగూడ, విష్ణుగూడ, హేటి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. తొమ్మిదిన్నర ఏళ్లలో ప్రజలకు ఇవ్వని హామీలు కూడా నెరవేర్చామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, జక్కుల మధుకర్, తాక్రే గంభీర్, సతీష్‌పవార్, తన్వీర్‌ఖాన్, బెదుర్కర్ సంతోష్, తాక్రే అనిల్, దీపక్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసి పార్టీలో చేరుతున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో లక్ష్మింపూర్, మాంగుర్ల, సుందరగిరి, కేఆర్‌కే కాలనీ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గోవర్ధన్, యాసం నర్సింగ్‌రావు, స్వరూపరాణి, ఆడ తిరుపతి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్, బీజేపీ నాయకులవి దిగజారుడు రాజకీయాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్, శంకర్‌గుట్ట, దుర్గానగర్, సుందరయ్య కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్ లీలానగర్, భగత్‌సింగ్, సుందరయ్యనగర్ కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ, విలాస్, సోమన్న, రత్నకిషోర్, గీత, మల్లేష్, అజయ్, మహేశ్, దినేష్, సురేశ్, సలీమ్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు

'బీజేపీకి కార్యకర్తలే బలం'


సోయం బాపురావును సన్మానిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: బీజేపీకి కార్యకర్తలే బలమని బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావు అన్నారు. శుక్రవారం మండలంలోని వడూర్, బుద్ధికొండ, తేజాపూర్, చింటోలి, కుప్టి, కుమారి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ బీజేపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దక్షిణమధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ, నాయకులు నారాయణసింగ్, హీరాసింగ్, ఆకుల రాజశేఖర్, మాధరావు ఆమ్టే, రాథోడ్ కమల్‌సింగ్, తొడసం శంకర్, చొక్కపెల్లి రాములు, కొప్పుల గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు ఖాయం

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు గెలుపు ఖాయమని బాపూరావు కుమార్తె సోయం కృష్ణవేణి అన్నారు. శుక్రవారం నాల్గో సెట్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మాట్లాడారు. ప్రజలు బీజేపీ గెలుపు కోసం స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. ఆమె వెంట ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజుయాదవ్ ఉన్నారు.

తాంసి: బోథ్ బీజేపీ అభ్యర్థి సోయం బాపురావుకు ఓటు వేసి ఆదరించాలని భీంపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు రాకేశ్‌యాదవ్ కోరారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని తాంసి(కె), గొల్లఘాట్, పిప్పల్‌కోటి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దేవారెడ్డి, అంకం అశోక్, వెంకటేశ్, సంజీవ్, కిషోర్, చిన్నయ్య, నరేశ్ పాల్గొన్నారు.

అనిల్‌జాదవ్ గెలుపు కోసం కృషి చేయాలి


ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ సాబ్లే కిషోర్‌సింగ్, మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండలంలోని లింగట్ల, ఆరెపల్లి, కొర్టికల్, చింతగూడ, గోండుగూడ, నంద్యతండా గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు సాబ్లే ప్రతాప్ సింగ్, ఉప్పు పోశెట్టి, ఏరు రాజేశ్వర్, జహీర్, అల్లూరి శివారెడ్డి, మేరుబాన్, కుంట కిరణ్ కుమార్ రెడ్డి, నారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌ను గెలిపించి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిరుమల్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని జై భీంనగర్, జవహార్ నగర్, హనుమాన్ నగర్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ జాదవ్ సునీతారమేశ్, ఎంపీటీసీ జ్ఞాను, శ్రీనివాస్ గౌడ్, మాధవ్ కేంద్రే, సంజీవ్ ముండే, రావణ్ ముండే, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని గుల్జార్‌కాలనీకి చెందిన పలువురు యువకులు ఎంపీపీ తుల శ్రీనివాస్ సమక్షంలో శుక్రవారం చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బోథ్: బీఆర్ఎస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు అండగా ఉంటుందని జెడ్పీటీసీ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాయినగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీడీ కార్మికులకు మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలను వివరించారు.

ప్రకాష్ అంబేద్కర్‌ను కలిసిన నాయకులు


ప్రకాష్ అంబేద్కర్‌ను సన్మానిస్తున్న నాయకులు

నార్నూర్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మనువడు ప్రకాష్ అంబేద్కర్‌ను శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించిన గిరిజనేతరుల సమావేశంలో మైనార్టీ రాష్ట్ర నాయకులు యునుస్ అక్బాని, గిరిజనేతరుల సంఘం అధ్యక్షుడు షేక్ దాదే అలీలు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

దళారుదే హవా..!

- పత్తి తూకం.. ధరలో తిరకాసు
- రిమోట్ కాంటాతో మోసం
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతుల వేడుకోలు


రైతులు పట్టుకున్న దళారి వాహనం

సిరికొండ: విత్తనాలు వేసిన నాటి నుంచి పంట చేతికి వచ్చి అమ్ముకునే వరకు రైతులు దళారుల చేతిలో మోసపోతునే ఉన్నారు. భూమిని నమ్ముకొని ఎండ, వానకు శ్రమిస్తూ.. అడవి జంతువుల భారీ నుంచి పంటను రక్షించుకుని పంటను అమ్ముకుందాం అంటే రైతులకు సరైన మద్దతు ధర లభించడం లేదు. దళారులు చెప్పిన ధరకే అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారు. ధరలో, తూకంలోనూ నిండా మునుగుతున్నారు.

మార్కెట్ ధర కంటే తక్కువ..

మండలంలోని 52 గ్రామాల ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరు ప్రధానంగా పత్తి పండిస్తున్నారు. పంటను కష్టపడి పండించి, చేతికి రాగానే దళారులు ఇంటి ఎదుట ప్రత్యక్షం అవుతున్నారు. రైతులకు మాయ మాటలు చెప్పి మార్కెట్ ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా రిమోట్ కాంటాతో మోసం చేస్తున్నారు.

గతంలో అనేక మోసాలు..

గతంలో గిరిజన గ్రామాల్లో దళారులు రిమోట్ కాంటాతో మోసం చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. క్వింటాల్‌కు 30కిలోల తేడా వచ్చింది. దీంతో వ్యాపారిని రైతులు నిలదీయడంతో తను చేస్తున్న మోసాన్ని ఒప్పుకున్నాడు. ఇలా ఒక్క దళారే కాదు అనేక మంది పత్తి వ్యాపారులు గ్రామాల్లో అమాయక గిరిజన రైతులను నిండా ముంచుతున్నారు.

పంట తరలింపులో ఇబ్బందులు..

మండలంలోని గిరిజన రైతులు తము పండించిన పంటను మార్కెట్ యార్డు కు తీసుకెళ్లి విక్రయించుకునేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. నూతన మండలంలో ప్రభుత్వం మార్కెట్ యార్డులు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇతర మండలాలకు తరలించకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన మార్కెట్‌యార్డులు ఏర్పాటు చేసి పంటలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్‌యార్డు ఏర్పాటు చేయాలి



మండలంలో మార్కెట్‌యార్డు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు తమ పండించిన పంటను ఇతర మండలాల్లో ఉన్న మార్కెట్‌కు తరలించలేక దళారులకు విక్రయిస్తున్నారు. తక్కువ ధరకే అమ్మి మోసపోతున్నారు. అధికారులు స్పందించి మండలంలో మార్కెట్‌యార్డును ఏర్పాటు చేయాలి.
– పెందుర్ అమృత్‌రావు, ఎంపీపీ, సిరికొండ

మద్దతు ధరతో కొనుగోలు చేయాలి



అమాయక గిరిజన రైతులను రిమోట్ కాంటాలతో మోసం చేస్తున్న పత్తి వ్యాపారులను, దళారులపై చర్యలు తీసుకోవాలి. నిత్యం పల్లెల్లో తనిఖీలు నిర్వహించాలి. మార్కెట్‌యార్డులో పంటలకు సరైన మద్దతు ధరతో కొనుగోలు చేయాలి.
– కాల్వ విలాస్, రైతు, సిరికొండ

అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ఎజెండా


ప్రచారం చేస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ప్రధాన ఎజెండా అని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని పంజేశా, చించర్‌వాడ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు యూనిస్ అక్బాని, భాస్కర్, బాదన్ గంగన్న, కస్తాల ప్రేమల పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899